సాక్షి
పల్నాడు

శుక్రవారం । 6 । సెప్టెంబర్ । 2024



57 వేల క్యూసెక్కులు విడుదల

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నుంచి రెండు క్రస్ట్ గేట్ల ద్వారా 57,456 క్యూసెక్కులు వదులుతున్నారు. ఎగువ నుంచి 30,401 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.



కేంద్ర మంత్రికి స్వాగతం

విమానాశ్రయం(గన్నవరం): వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించేందుకు విచ్చేసిన కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్‌కు విమానాశ్రయంలో నాయకులు, అధికారులు స్వాగతం పలికారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 587.80 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 8,529 క్యూసెక్కులు వదిలారు.

కౌలు రైతు కన్నీరు

- వరదలకు దెబ్బతిన్న పత్తి, మిరప పంటలు
- రూ.లక్షలు ఖర్చు చేసి సాగు చేసిన కౌలు రైతులు
- పూర్తిగా పంట కుళ్లిపోవడంతో తిరిగి పెట్టుబడి పెట్టాల్సిన దుస్థితి
- ప్రభుత్వం కౌలు రైతులకు న్యాయం చేయాలని డిమాండ్
- జిల్లాలో కొనసాగుతున్న పంట నష్టం నమోదు
- సబ్సిడీపై విత్తనాల సరఫరా నోరుమెదపని ప్రభుత్వం
- ప్రభుత్వం సాయం ప్రకటించాలని డిమాండ్ చేస్తున్న రైతులు



పెదకూరపాడు మండలం పోడపాడు గ్రామంలో దెబ్బతిన్న పత్తి సాగు



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు ఆలా లక్ష్మీనారాయణ, గోపాల్‌నగర్, అమరావతి. తన సొంత పొలంతోపాటు సుమారు 40 ఎకరాలకుపైగా కౌలు తీసుకొని పత్తి సాగు చేశాడు. అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు వాగులు, కృష్ణానదికి వచ్చిన వరదలతో పంట మొత్తం పూర్తిగా దెబ్బతింది. ఇప్పటికే సుమారు రూ.5 లక్షల దాకా ఖర్చు చేశాడు. తిరిగి పంట మళ్లీ సాగుచేయాలంటే కనీసం మరో రూ.4 లక్షలు కావాలి. ఇంత వరకు ప్రభుత్వం నష్టపరిహారం విషయంలో ఎటువంటి నిర్ణయం ప్రకటించటలేదు. నష్టపరిహారం ఇచ్చేటప్పుడు కౌలు రైతులు నష్టపోకుండా నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నాడు. రైతులకు మరో పంట సాగు చేయటానికి విత్తనాలు, ఎరువులు ఉచితంగా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాడు. ఇది ఒక్క లక్ష్మీనారాయణ పరిస్థితే కాదు జిల్లాలో భూమి కౌలుకి తీసుకొని సాగుచేసిన వేలాది మంది కౌలు రైతుల వ్యథ.

సాక్షి, నరసరావుపేట: ఒంట్లో సత్తువ, వ్యవసాయంపై మక్కువ ఉండి సాగు చేయడానికి సొంత భూమిలేని ఎందరో కౌలు రైతులను వరుణుడు నిండా ముంచేశాడు. బతుకుదెరువు కోసం పొలాలు కౌలు తీసుకొని కోటి ఆశలతో రూ.లక్షలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటలు రాత్రి రాత్రికి వరద నీటిలో కొట్టుకుపోయాయి. చేసిన శ్రమ, పెట్టిన పెట్టుబడి మొత్తం కృష్ణార్పణమైంది. తిరిగి మళ్లీ సాగు చేయాలంటే మరోసారి అప్పులు చేయాల్సిన దుస్థితి. ప్రభుత్వం ఇప్పటి వరకు వరదల్లో నష్టపోయిన రైతులను ఏవిధంగా ఆదుకుంటుందో చెప్పలేదు. ఇచ్చినా ఆ సాయం రైతుకు వెళుతుంది, మరి మా పరిస్థితి ఏంటని కౌలురైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం కౌలు రైతుల కష్టాన్ని అర్థం చేసుకొని నష్టపోకుండా చూడాలని కోరుతున్నారు. పల్నాడు జిల్లాలో వరదల వల్ల నష్టపోయిన మొత్తం రైతులు 11,579 మంది ఉండగా, అందులో కౌలు రైతులు సుమారు 3,750 మంది ఉంటారని అధికారులు అంచనా.

సాయంపై నోరుమెదపని ప్రభుత్వం

గత వారం జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. సుమారు 28,185 ఎకరాల్లో సాగు చేసిన 11,579 మంది రైతులకు చెందిన పంటలు వరదనీటిలో కుళ్లిపోవడం, కొట్టుకుపోవడం జరిగింది. రూ.కోట్లలో రైతన్నలు నష్టపోయారు. ఇప్పటి వరకు ప్రభుత్వం నష్టపోయిన రైతులకు ఏ విధమైన సాయం అందిస్తోంది ప్రకటించలేదు. మంగళవారం దాకా ప్రాథమిక నష్ట అంచనాలు వేయగా, బుధవారం నుంచి నష్ట వివరాలు నమోదు చేస్తున్నారు. ఇందులో 33 శాతం కన్నా ఎక్కువ పంట నష్టపోతేనే రైతుకు నష్టపరిహారం వస్తుందనే మెలికను ప్రభుత్వం పెట్టి, చాలా మందిని అనర్హులుగా ప్రకటించే కుట్ర చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. నీటిలో నాలుగైదు రోజులు మునిగిన పంట చాలా వరకు కుళ్లిపోతున్నాయని, బతికినా పంట దిగుబడి వచ్చే పరిస్థితిలేదంటున్నారు. ప్రభుత్వం ఉదారంగా వ్యవహరించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. ముఖ్యంగా తిరిగి పంట సాగు చేయడానికి త్వరగా వంద శాతం సబ్సిడీతో విత్తనాలు ఇవ్వాలని, లేకపోతే సాగు సమయం ముగుస్తుందని ఆందోళన పడుతున్నారు. అయితే రైతుల గురించి ఇప్పటివరకు ప్రభుత్వం తన విధానాలను ప్రకటించలేదు.



నరసరావుపేట మండలం ఉప్పలపాడు గ్రామంలో కూలిపోయిన కూరగాయల పందిళ్లు



దాచేపల్లి మండలం రామాపురం గ్రామంలో కుళ్లిపోయిన పత్తి చేను

18 ఎకరాల్లో పంట నాశనం



11 ఎకరాల్లో పత్తి, 7 ఎకరాల్లో మిర్చి సాగు చేశా. అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు మొత్తం పంట నీట మునిగింది. మొక్కలు వాలిపోయాయి. పంట ఏ మాత్రం పనికి వచ్చేలా లేదు. ప్రభుత్వం వెంటనే స్పందించాలి. పరిహారం అందజేసి నా లాంటి రైతులను ఆదుకోవాలి.

– విప్పల రాజశేఖర్‌రెడ్డి, రైతు, పీసపాడు, క్రోసూరు మండలం

కౌలుకు సాగుచేశా..



నాకున్న ఐదెకరాలు పోను మరో 12 ఎకరాలు కౌలుకు తీసుకొని అందులో ఏడు ఎకరాలు మిరప, 10 ఎకరాలు పత్తి పంటను సాగుచేశాను. భారీ వర్షాలకు పంట తీవ్రంగా దెబ్బతింది. వ్యవసాయంపై మక్కువతో రూ.లక్షలు ఖర్చుచేసి కౌలుచేసిన పంట వరద నీటిలో మునగడంతో ఆర్థికంగా నష్టపోయాను. కోలుకునే పరిస్థితి లేదు. ప్రభుత్వం కౌలు రైతుల కష్టాలను అర్థం చేసుకొని ఉదారంగా సాయం చేయాలి.

–దేవళ్ల పిచ్చయ్య, తంగెడ, దాచేపల్లి మండలం

కష్టమంతా కృష్ణమ్మ పాలైంది



ఆరుగాలం శ్రమించిన కష్టమంత కృష్ణమ్మ పాలైంది. కౌలు చెల్లించి అప్పులు చేసి రూ.2లక్షలకుపైగా పెట్టుబడి పెట్టి అర ఎకరంలో కంద పంటను, అర ఎకరంలో పసుపు సాగు చేశాను. రెండు నెలలు ఉంటే కంద పంట చేతికొచ్చేది. చేసిన అప్పులు కొంతైనా తీరేవి. ఈలోపు వరద వచ్చి మా పంటలను తుడిచిపెట్టేసింది. మరలా సాగు చేయాలంటే పెట్టుబడి పెట్టాలి. చేతిలో చిల్లిగవ్వ కూడా లేదు. సాగుకు అప్పులు కూడా ఇచ్చేవారు లేరు. ప్రభుత్వం కనీస పెట్టుబడి సాయాన్ని అందించి ఆదుకోవాలి.

– జి.రాంబాబు, కౌలురైతు, కిష్కిందపాలెం, కొల్లూరు మండలం

కూరగాయల తోటలు నేలకొరిగాయి



నేను ఐదెకరాల్లో సొరకాయ, 10 ఎకరాల్లో దొండకాయ సాగుచేశాను. తీగలు అల్లించడానికి 15 ఎకరాల్లో పందిరి వేశాను. భారీ వర్షాలకు పందిరి కర్రలు కూలిపోయి, కూరగాయల తీగలు తెగిపోయాయి. మొక్కలు కుళ్లిపోవడం, పూత, పిందెలు రాలిపోయాయి.

-తన్నీరు శ్రీనివాసరావు, ఉప్పలపాడు, నరసరావుపేట మండలం

మళ్లీ సాగుచేయాల్సిందే...



నేను రెండు ఎకరాల్లో మిరప పంటను సాగుచేశాను. అల్పపీడన ప్రభావంతో కురిసన భారీ వర్షాలకు మిరప పంట నీట మునిగి మొక్కలు కుళ్లిపోతున్నాయి. తిరిగి మిర్చి మొక్కలు నాటాల్సిందే. దీంతో రెండుసార్లు పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. ఇది రైతులు భారంగా మారింది.

-గుంజి సాంబయ్య, తంగెడ, దాచేపల్లి మండలం

18 ఎకరాల పంట నాశనమైంది



నేను 11 ఎకరాల్లో పత్తి, ఏడు ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశాను. అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు 18 ఎకరాల్లో పంట నీట మునిగింది. నీరు నిలవడంతో మొక్కలు వాలిపోయాయి. పంట ఏమాత్రం పనికి వచ్చేలా లేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి, నష్ట పరిహారం అందజేసి రైతులను ఆదుకోవాలి.

-విప్పల రాజశేఖర్‌రెడ్డి, రైతు, పీసపాడు, క్రోసూరు మండలం

న్యూస్‌రీల్

కొండవీడు పర్యటనకు 15 వరకు రావద్దు

చిలకలూరిపేట: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో కొండవీడు ఘాట్ రోడ్డుపై కొండచరియలు విరిగి పడిన నేపథ్యంలో ఈ నెల 15 వరకు పర్యాటకులు ఎవరూ కొండవీడు రావద్దని జిల్లా కలెక్టర్ పి అరుణ్‌బాబు తెలిపారు. కొండవీడు ఘాట్ రోడ్డును, నగర వనాన్ని గురువారం ఆయన పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ రోడ్లు, భవనాల శాఖ అధికారుల సమన్వయంతో ఘాట్‌రోడ్డుపై విరిగి పడిన కొండచరియల తొలగింపునకు సత్వర చర్యలు చేపట్టాలని జిల్లా అటవీఅధికారి రామచంద్రరావును ఆదేశించారు. ఘాట్‌రోడ్డుపై ప్రయాణం ప్రమాదకరంగా ఉన్న నేపథ్యంలో, ప్రమాద రహిత స్థాయి ఏర్పడేవరకు పర్యాటకులు రాకుండా అధికారులు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. ఇబ్బందులు లేవు అని నిర్ధారించుకున్నాకే పర్యాటకులను అనుమతించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ, అటవీ అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో 107.8 మి.మీ వర్షపాతం నమోదు

నరసరావుపేట: గడిచిన 24గంటల వ్యవధిలో జిల్లాలో 107.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసిందని అధికారులు గురువారం తెలియచేశారు. అత్యధికంగా పెదకూరపాడులో 22.0 మి.మీ వర్షం కురిసిందని చెప్పారు. జిల్లాలోని రెంటచింతల, గురజాల, కారెంపూడి మండలాలు మినహా మిగతా మండలాల్లో వర్షం కురిసింది. వర్షపాతం పరిశీలిస్తే...నరసరావుపేటలో 1.4, మాచర్లలో 3.4, వెల్దుర్తిలో 4.2, దుర్గిలో 2.2, దాచేపల్లిలో 1.0, పిడుగురాళ్లలో 1.6, మాచవరంలో 1.2, బెల్లంకొండలో 1.8, అచ్చంపేటలో 3.0, క్రోసూరులో 10.8, అమరావతిలో 8.4, సత్తెనపల్లిలో 2.0, రాజుపాలెంలో 4.2, నకరికల్లులో 2.2, బొల్లాపల్లిలో 2.2, వినుకొండలో 3.8, నూజెండ్లలో 2.2, శావల్యాపురంలో 4.2, రొంపిచర్లలో 1.2, ఈపూరులో 2.8, ముప్పాళ్లలో 6.2, నాదెండ్లలో 2.4, చిలకలూరిపేటలో 2.2, యడ్లపాడులో 11.2 మి. మీటర్ల వర్షం కురిసిందని వెల్లడించారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

పిడుగురాళ్ల: రెండు రోజుల కిందట పిల్లేరు వాగులో గల్లంతైన శ్రీనివాసరావు మృతదేహం గురువారం లభ్యమైందని పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు తెలిపారు. మండలంలోని కోనంకి గ్రామానికి చెందిన శీలం శ్రీనివాసరావు(45) రెండు రోజుల కిందట గ్రామానికి చెందిన పుణ్యాల సాంబశివారెడ్డికి చెందిన మోటర్ పంపు పిల్లేరు వాగులోని ఇసుక మేటలో ఉండిపోయింది. దానిని వెలికి తీసేందుకు శ్రీనివాసరావు పిల్లేరు వాగులో దిగాడు. వాగు ఉధృతి పెరగటంతో గల్లంతయ్యాడు. గజ ఈతగాళ్లు రెండు రోజులుగా గాలింపు చేపట్టారు. గురువారం మృతదేహాన్ని వెలికితీశారు.

లో లెవల్ ..బాధలు హై లెవల్

- నియోజకవర్గంలో 20కి పైగా చప్టాలు
- చిన్నపాటి వర్షాలకే పొంగుతున్న వాగులు
- నిలిచిపోతున్న రాకపోకలు



నీరు కుంట వాగు పొంగి కాలచక్రం రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

పెదకూరపాడు: చినుకు పడితే చాలు నియోజకవర్గ ప్రజలలో ఆందోళన మొదలవుతుంది. వాగులు పొంగుతున్నాయి. లో లెవల్ చప్టాలపైగా నీరు ప్రవహిస్తోంది. గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. ఆ మార్గంలో వెళ్లేందుకు ప్రజలు భయపడుతున్నారు. ఒకవేళ సాహసించి వెళితే ప్రమాదం బారిన పడుతున్నారు. నియోజకవర్గంలో 20కిపైగా లో లెవల్ చప్టాలు ఉన్నాయి. వాటి స్థానంలో హై లెవల్ వంతెనలు నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

లో లెవెల్ చప్టాలు ఇవే..

- సత్తెనపల్లి నుంచి అమరావతి వెళ్లే మార్గం(కాలచక్ర రహదారి) ఎనిమిది చప్టాలు ఉన్నాయి. సత్తెనపల్లి మండలం నందిగామ, పెద్దమక్కెన, గుడిపూడిల వద్ద ఒక్కొక్కటి ఉన్నాయి. పెదకూరపాడు వద్ద పేరమ్మ వాగుపై చప్టా ఉంది. అబ్బురాజుపాలెం- పెదకూరపాడు మధ్య ప్రవహించే నీరు కుంట వాగుపై ఒకటి, 75త్యాళ్లూరులో లెవెల్ చప్టా, పరస వద్ద చప్టా, బలుసుపాడు-లింగాపురం చప్టా, కాశిపాడు వెళ్లే రహదారిలో లో లెవెల్ చప్టా ఉన్నాయి. వాగులు పొంగినప్పుడు ఆయా మార్గాలలో పూర్తిగా రాకపోకలు నిలిచిపోతున్నాయి.
- పెదకూరపాడు-గుంటూరు రహదారిలో పెదకూరపాడు వద్ద లో లెవెల్ చప్టా ఉంది. వర్షాలకు వాగు ఉగ్రరూపం దాల్చుతుంది. ఈ చప్టా కింద ఉన్న తూములు వ్యర్థాలతో నిండిపోవడంతో చప్టాపైగా నీరు ప్రవాహించి గుంటూరుకు రాకపోకలు నిలిచిపోతున్నాయి.
- పెదకూరపాడు మండలం కంభంపాడు వద్ద లో లెవెల్ చప్టా, కంభంపాడు- జలాల్‌పురం మధ్యలో చప్టాలపై పది అడుగుల మేరకు ప్రవాహించడంతో ఈ మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి.
- పెదకూరపాడు-పాటిబండ్ల మధ్య రెండు లోలెవెల్ చప్టాలు ఉన్నాయి. వర్షాలకు పొంగిపొర్లడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి.
- అమరావతి మండలం పెద్ద మద్దూరు వద్ద చప్టా ప్రమాదంగా మారింది. వర్షం పడితే చాలు బ్రిడ్జిపై నుంచి నీటి ప్రవాహం పెరగడంతో అమరావతి- విజయవాడ, అమరావతి - మంగళగిరికి రాకపోకలు నిలిచిపోతాయి.
- క్రోసూరు మండలం ఉంటుకూరు వద్ద ఎద్దు వాగుపై బ్రిడ్జి నిర్మించినప్పటికీ పక్కన నుంచి లోలెవెల్ చప్టాపై ప్రవాహిస్తున్నాయి. దీంతో క్రోసూరు-అమరావతి, అమరావతి-అచ్చంపేట రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ వాగు పొంగడంతో పంట పొలాలు నీట మునిగి తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి.

తప్పిన ప్రమాదాలు...

- పెదకూరపాడు వద్ద నీరుకుంట వాగు పొంగి కారు కొట్టుకుపోయింది. పోలీసులు అప్రమత్తమై కారును, కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులకు సరక్షితంగా కాపాడారు.
- కాలచక్ర రోడ్డులోని నీరు కుంట వాగులో ఇద్దరు వ్యక్తులు గల్లంతయ్యారు. వారిని పోలీసులు కాపాడారు. ద్విచక్ర వాహనం నీటి ప్రవాహంలో కొట్టుకుపోయింది.
- పేరమ్మ వాగులో నీటి ప్రవాహానికి ఆటో కొట్టుకుపోతుంటే స్థానికులు కాపాడారు.
- కంభంపాడు లోలెవెల్ చప్టా ఉధృతికి గతంలో ఇద్దరు వ్యక్తులు కొట్టుకుపోయారు. వారు చెట్ల సహాయంతో బతికి పోయారు.

చప్టాల పూడిక తీయాలి

పూర్వ కాలంలో నిర్మించిన చప్టాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. చప్టాలు పూడికతీత లేకపోవడంతో వర్షపు నీరు ప్రవాహించే మార్గం లేక రోడ్డుపై వస్తున్నారు. చప్టాలను గుర్తించి వాటిలో ఉన్న పూడికతీతను, ఆక్రమణలను తొలగించి నీరు పారే మార్గం చూపించాలి.

– వెలితోటి అనిల్‌కుమార్, పొడపాడు

ప్రమాదాలు జరగకుండా గస్తీ

లో లెవెల్ చప్టాలు ఈ ప్రాంతంలో ఎక్కువగా ఉన్నాయి. వర్షం కురిసినప్పుడు చప్టా వద్ద పోలీసులతో గస్తీ నిర్వహిస్తున్నాం. ఇటీవల నీరు కుంటలో కొట్టుకుపోయిన వ్యక్తులను కాపాడం. భారీ వర్షాలు కురిసినప్పుడు చప్టాలపై ప్రవాహిస్తున్న నీరు ఉధృతిని అంచనా వేయలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. పోలీసుల సూచనలు పాటించాలి.

– బాలూ నాయక్, ఎస్‌ఐ పెదకూరపాడు



పెదకూరపాడులోని పేరమ్మ వాగు పొంగి చప్టాపై ప్రవహిస్తున్న వర్షపు నీరు



కంభంపాడు వద్ద లోవెల్ చప్టాపై పారుతున్న వర్షపు నీరు

ఉపాధ్యాయుడే మార్గదర్శకుడు

- జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు
- ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేటఈస్ట్: సమాజానికి మార్గదర్శకుడు ఉపాధ్యాయుడేనని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. ప్రకాష్‌నగర్‌లోని భువనచంద్ర టౌన్‌హాల్‌లో గురువారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో కలసి ఆయన పాల్గొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల నుంచి ఎంపిక చేసిన 68మందిని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలతో సత్కరించారు. జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ తన ఉన్నతికి పాఠశాల స్థాయి నుంచి విద్య నేర్పిన గురువులే కారణమని తెలిపారు. తన మాతృమూర్తి తెలుగు ఉపాధ్యాయినిగా తమను క్రమశిక్షణతో పెంచి తమ ఉన్నతికి పాటుపడిందని వివరించారు. ఉపాధ్యాయులు తమ విద్యార్థుల ఉన్నతికి కృషి చేసినపుడే వారికి తగిన గుర్తింపు, గౌరవం లభిస్తుందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు మాట్లాడుతూ, వ్యక్తి తాను ఎంత ఉన్నత స్థానంలో ఉన్నా తనకి విద్య నేర్పిన గురువుల పట్ల గౌరవాన్ని కలిగి ఉండాలన్నారు. నేడు పెరిగిన సాంకేతికతతో సొంతంగా నేర్చుకునే అవకాశం కలుగుతున్నప్పటికీ గురువు ఉన్న ఉన్నత స్థానం మార్పు చెందదని స్పష్టం చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓలు వేణుగోపాలరావు, యేసుబాబు, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

రాజకీయాలను ప్రతిబింబిస్తే చర్యలు

- పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు హెచ్చరిక
- చిలకలూరిపేట పట్టణంలో ఆకస్మిక పర్యటన



ఓగేరు వాగును పరిశీలిస్తున్న ఎస్పీ కె.శ్రీనివాసరావు

చిలకలూరిపేటటౌన్: రాజకీయాలను ప్రతిబింబించే విధంగా వినాయకుడి ప్రతిమలను ఏర్పాటు చేయకూడదని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు హెచ్చరించారు. చిలకలూరిపేట పట్టణాన్ని ఆకస్మికంగా సందర్శించిన ఆయన పలు వినాయక చవితి పందిళ్లు ఏర్పాటుచేసే ప్రాంతాలను అర్బన్ పోలీసులతో కలిసి పరిశీలించారు. ముందుగా ఎన్ఆర్‌టీ సెంటర్, అడ్డరోడ్డు సెంటర్, పురుషోత్తమపట్నం, కళామందిర్ సెంటర్లలో పర్యటించారు. అనంతరం ఓగేరు వాగుకు వెళ్లి నిమజ్జన వేడుకలకు అనువుగా ఉంటుందా లేదా అనే విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలీసులకు పలు సలహాలు, సూచనలు చేశారు. చివరిగా వినాయక చవితి వేడుకలు, నిమజ్జన వేళ పాటించాల్సిన నిబంధనలపై పండుగ నిర్వహణ కమిటీలతో చర్చించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రతి మండపానికి కనీసం ఒక సీసీ కెమెరా ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఉండే ప్రదేశాలలో పందిళ్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కమిటీలు తప్పని సరిగా తమ మండపాల నిర్వహణకు పోలీసుల అనుమతి తీసుకోవాలని, వివాదాలు, గొడవలు జరిగే అవకాశం ఉన్న ప్రదేశాల్లో మండపం ఏర్పాటుకు అనుమతి కోరవద్దన్నారు. మతపరమైన సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రాంతాలు చర్చిలు, మసీదులు ఉన్నచోట ఎస్ఐలు క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత మాత్రమే అనుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. అర్బన్ సీఐ పి రమేష్, ఎస్ఐ చెన్నకేశవులు, రహంతుల్లా ఉన్నారు.



బస్సుపై పడిన చెట్టు

తప్పిన ప్రమాదం

వినుకొండ(నూజెండ్ల): ఆర్టీసీ బస్సుపై భారీ చింతచెట్టు విరిగి పడింది. వినుకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు పొదిలి నుంచి తిరిగి వస్తుండగా నూజెండ్ల మండలం ఐనవోలు గ్రామ సమీపంలోకి రాగానే ఈదురుగాలులతో కూడిన వర్షానికి భారీ చింతచెట్టు విరిగి బస్సుపై పడింది. ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈఘటనలో ప్రాణనష్టం జరగకపోవటంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. బస్సు రోడ్డుపై ఉండటంతో వినుకొండ పొదిలి, దర్శి, కురిచేడు వైపు భారీగా ట్రాఫిక్ నిలచిపోవటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆర్టీసీ అధికారులు సంఘటనా ప్రాంతానికి చేరుకుని చెట్టును తొలగించడంతో సమస్య పరిష్కారం అయ్యింది. పోలీసులు ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.